ఆయన రాలేదు. తన యిష్ట దైవం తన యింటికి వస్తానని రానందుకు ఆమెకి ఎంతో దుఃఖం వచ్చింది.

మర్నాడు మళ్ళీ భాగ్యవతి పూజ అయ్యాక డోర్ బెల్ మోగింది. పోస్ట్‌మేన్ ఆమెకి ఇంకో కార్డు యిచ్చాడు. క్రితం రోజు చేతిరాతే కనబడటంతో ఆత్రంగా దాన్ని చదివింది ఆమె. అందులో ఇలా వుంది.

డియర్ భాగ్యవతి,

నిన్న నాకు చక్కటి భోజనం పెట్టి నా కడుపు నింపావు. పైగా నా భార్యకి కోటు కూడా యిచ్చావు. థ్యాంక్స్.

నీ,

శ్రీనివాసుడు.

## 41. నాస్తికులు

నాస్తికులైన ఓ జంట దండలు మార్చుకుని పెళ్ళి చేసుకున్నారు. కొన్నాళ్ళకి వాళ్ళకో పాప పుట్టింది. నాస్తికులు కాబట్టి దైవ సంబంధమైన పేరు పెట్టడం యిష్టం లేక 'ఓల్గా' అనే పేరు పెట్టారు. వాళ్ళు తమ కూతురికి దేవుడి గురించి తెలీకుండా పెంచసాగారు. వాళ్ళయింట్లో దేవుడి పటం లేదు. పూజ అసలు లేనే లేదు. దాంతో ఓల్గాకి దేవుడి ఉనికి గురించి తెలీదు. క్రమంగా ఓల్గాకి అయిదేళ్ళు వచ్చాయి.

ఓ రోజు ఓల్గా తల్లితండ్రులు తమ బిడ్డతో ఆటోలో వెళ్తూంటే ఏక్సిడెంటయి ఆటో తలకిందులైంది. భార్యాభర్తలిద్దరూ అక్కడికక్కడే మరణించారు. ఓల్గాకేం కాలేదు. తల్లితండ్రులిద్దరూ మరణించడంతో ఆలనా పాలనా చూడటానికి ఎవరూ లేని ఓల్గా అనాథయింది. దిక్కులేని ఆ పాపని ఓ పెద్దమనిషి తన యింటికి తెచ్చుకుని పెంచుకోదలచుకున్నాడు. అందుకు కోర్టు నించి అనుమతిని పొందాక ఆ పాపని తనింటికి తీసుకెళ్ళాడు. పెద్ద

వారింట్లోని వినాయకుడు, వెంకటేశ్వరస్వామిల ఫొటోలని చూసి వారెవరని అడిగింది ఓల్గా. ఓల్గాకి దేవుడి గురించి ఏమీ తెలీదని క్రమంగా గ్రహించాడా పెద్ద మనిషి. ఏ పండుగ గురించి కూడా తెలీదు ఓల్గాకి. శ్రీరామనవమికి ఆయన ఓల్గాని దగ్గరలోనే వున్న ఓ దేవాలయానికి తీసుకెళ్ళి శ్రీరామచంద్రుడి విగ్రహం చూపించి చెప్పాడు.

"ఆయనెవరో తెలుసా? ఇంకో దేవుడు."

"తెలుసు." చెప్పింది ఓల్గా

"ఇంతదాకా నిన్నీ గుడికి తీసుకురాలేదుగా? అయినా నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు ఆయన.

"మా అమ్మ, నాన్న చచ్చిపోయాక నేను రోడ్డు పక్కన కూర్చుని ఏడుస్తూంటే, పోలీసులు వచ్చేదాకా నన్ను ఎత్తుకుని ఆడించింది ఆయనే కదా." జవాబు చెప్పింది ఓల్గా.

## 42. ధనవంతురాలు

శైలజ ఓ మధ్యతరగతి వుద్యోగి భార్య. ఆయనకి వచ్చే జీతం వారి సంసారం గడపడానికి బొటాబొటిగా సరిపోతుంది. ఆమెకి ఎన్నో కోరికలు. డివిడి ప్లేయర్, కంప్యూటర్, పెద్ద కలర్ టి.వి, ప్రతీ వేసవిలో ఊటీకి వెళ్ళి సెలవులు గడపాలన్న కోరిక, యింకా ఎన్నెన్నో కోరికలు ఆమెకున్నాయి.

అయితే వారి కుటుంబ కనీస అవసరాలకి డబ్బు ఖర్చయ్యాక ఆ కోరికలు తీర్చుకోడానికి ఇంకేమీ మిగలదు. తన బీదతనానికి ఆమె ఎంతో బాధపడుతూ ఉంటుంది. తమ పేదతనం తొలగించమని నిత్యం ఆమె శ్రద్ధగా లలితా సహస్రనామ పారాయణం పూర్తిచేసి కాని భోజనం ముట్టదు.

ఆ రోజు ఉదయం నించి బాగా వర్షం పడుతోంది. పారాయణం, నైవేద్యం అయాక కంచంలో అన్నం వడ్డించుకుంది. మొదటి ముద్ద నోట్లో